హెచ్ఎంలకు పాఠ్య పుస్తకాలు అందజేత

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న విద్యాధికారి

బొంరాస్‌పేట, మే 31 : మండల విద్యా వనరుల కేంద్రానికి వచ్చిన పాఠ్య పుస్తకాలను శనివారం ఎంఈవో హరిలాల్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఇప్పటివరకు 91 శాతం పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. మిగిలిన పుస్తకాలు పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్దార్, సీఆర్పీలు గౌస్ సోమ్లా నాయక్, వేణుగోపాల్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్ : మండల పరిధిలోని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం 52 వేల పాఠ్యపుస్తకాల అవసరం ఉండగా 38,037 పుస్తకాలు అందజేశారు. మిగతా పుస్తకాలు వచ్చే రెండు నెలల్లో రావచ్చని అధికారులు చెబుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పుస్తకాలు సిద్ధంగా ఉంచాలని వారు కోరుతున్నారు.

సీజ్ చేసిన ఇసుకకు వేలంపాట

వేలంపాట నిర్వహిస్తున్న ఆర్ఐ శిరీష

బొంరాస్ పేట, మే 31 : మండల పరిధిలోని దుప్చర్ల గ్రామంలో శుక్రవారం ఆర్ఐ శిరీష అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను సీజ్ చేశారు. శనివారం ఉదయం సీజ్ చేసిన 52 ట్రాక్టర్ల ఇసుక డంపులకు బహిరంగ వేలం పాట నిర్వహించడానికి వెళ్లిన సమయంలో మరో 6 ట్రాక్టర్ల ఇసుక డంపులను సీజ్ చేశారు. మొత్తం 58 ట్రాక్టర్ల ఇసుకను ఆర్ఐ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది బహిరంగ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన మైసని నర్సింహులు రూ.36వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

బొంరాస్ పేట, మే 31 : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై రావూఫ్ సూచించారు. శనివారం మండల పరిధిలోని బురాన్పూర్ చౌరస్తాలో ఎస్సై ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో నంబర్ ప్లేటు లేని 21 వాహనాలను సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

ధూమపానం ఆరోగ్యానికి ప్రమాదకరం

- పరిగి జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప
- భవన నిర్మాణ కార్మికులకు అవగాహన

పరిగి : సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప

పరిగి, మే 31 : ధూమపానంతో అనేక అనర్థాలు కలుగుతాయని, వాటికి దూరంగా ఉండాలని పరిగి జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప సూచించారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరిగి పట్టణంలోని ఓ పాఠశాల ఆవరణలో భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ.. పొగాకును వినియోగిస్తే కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ధూమపానం మానేస్తే చాలా ప్రయోజనాలు ఉంటాయన్నారు. వీటిని మానేసిన కొద్ది రోజుల్లోనే గుండె పనితీరు మెరుగుపడుతుందని, రక్తపోటు తగ్గుతుందని, ఊపిరితిత్తులు ఆరోగ్యంగా మారతాయని చెప్పారు. ధూమపానం అలవాటు ఉన్నవారు మానేయాలని, అలవాటు లేనివారు భవిష్యత్తులో అలవాటు చేసుకోవద్దని సూచిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అడ్వకేట్లు గౌస్ పాషా, బార్ అసోసియేషన్ సెక్రటరీ గోపాల్ నాయక్, అడ్వకేట్లు రాము యాదవ్, కృష్ణయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

వికారాబాద్ : ప్రతి ఒక్కరూ పొగాకుకు దూరంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లుతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పొగాకు వాడితే కలిగే నష్టాలను వివరించారు. పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే దుష్ఫలితాలు, నివారణ చర్యలు, కౌన్సెలింగ్, న్యాయ సలహాలు, యువత ఆకర్షణకు లోను కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిగరెట్లు, తంబాకు, జర్దా, గుట్కా తదితర వాటికి ప్రజలు దూరంగా ఉండాలని సూచిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నిరోషా, ఉపవైద్యాధికారులు జీవరాజ్, రవీంద్రయాదవ్, ప్రవీణ్, వైద్యులు, పర్యవేక్షక, పారా మెడికల్ సిబ్బంది, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కులకచర్లలో..

కులకచర్ల : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ కిరణ్‌కుమార్‌గౌడ్ పొగాకు వాడితే జరిగే నష్టాలను వివరించారు. పొగాకును పూర్తిగా మానివేయాలన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వికారాబాద్ : ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ తదితరులు

కులకచర్ల : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కేటీఆర్‌పై విమర్శలు సరికాదు

వికారాబాద్, మే 31 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శలు చేయడం సరికాదని పార్టీ జిల్లా నాయకుడు మాచన్‌పల్లి సురేశ్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ నిర్వహించిన బీజేపీ సమావేశంలో ఎంపీ.. కేటీఆర్‌పై విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మీకు రాజకీయ భిక్ష పెట్టింది కేసీఆర్ కుటుంబమే అని గుర్తుంచుకోవాలన్నారు. అధిష్ఠానం దగ్గర మార్కులు కొట్టేయడానికి కేటీఆర్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు. ఇలాగే నోరు పారేసుకుంటే బీఆర్ఎస్ కార్యకర్తల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. బీజేపీ ఎంపీగా గెలిచి ఈ ప్రాంతం అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సారించకుండా కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మీరు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. మొయినాబాద్ నుంచి మన్నెగూడ వరకు రావాల్సిన నాలుగు లైన్ల రోడ్డు పనులు ఇంకా ప్రారంభించకపోవడంతో పలువురు రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నా పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపు నిలబడతారని, ఇకనైనా ఈ చౌకబారు ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వికారాబాద్ మే 31 : మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈ సంజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ టౌన్, గిర్ ఘట్‌పల్లి, మదన్‌పల్లి, సిద్ధలూర్ విద్యుత్ ఉపకేంద్రంలో అత్యవసర మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. ఆ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తడిసిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలి

నాగారం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

ధారూరు, మే 31 : రైతులు పండించిన వరి ధాన్యం తడిసినా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ ధారూరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ధారూరు మండల పరిధిలోని మోమిన్‌కలాన్, నాగారం, తరిగోపుల గ్రామాల్లో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం వికారాబాద్ కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేసి, వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. రైతులకు సరిపడా జీలుగ, జనుము విత్తనాలు సరపరా చేయాలన్నారు. మోమిన్‌కలాన్ గ్రామంలో 60 మంది రైతులకు సంబంధించిన వరి ధాన్యం వారి ఇండ్ల వద్దనే ఉండిపోయిందని, వారం నుంచి కురుస్తున్న వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వాలని తెలిపారు. నాగారంలోని కొనుగోలు కేంద్రంలో దాదాపు 35 లారీల లోడ్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు చేశారని, హమాలీలకు డబ్బులు చెల్లించలేదని వెంటనే ఇవ్వాలన్నారు. అలాగే సన్నవడ్లు కొన్న రైతులకు రవాణా సౌకర్యం కలిగించకుండా నేరుగా రైతుల ట్రాక్టర్లతో రైస్ మిల్లులకు పంపించారని, వారికి ట్రాన్స్‌పోర్టు డబ్బులు చెల్లించాలన్నారు. తరిగోపుల వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం కావస్తున్నా ఒక బస్తా ధాన్యం కుడా కొనుగోలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికే దాదాపు సగం మంది రైతులు ప్రైవేటులో విక్రయించి నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, రాములు, దేవేందర్‌నాయక్, నరోత్తంరెడ్డి, భీమ్ సేన్‌రావు, బాల్‌రాజ్‌నాయక్, కృష్ణారెడ్డి, హఫీజ్, జైపాల్‌రెడ్డి, దశరథ్, రాజు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో అక్రమ నిర్మాణాల కూల్చివేత

జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

తాండూరు, మే 31 : తాండూరు మున్సిపల్ పరిధిలో రోడ్లకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను శనివారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో కూల్చివేశారు. తాండూరు పట్టణంలో నేషనల్ హైవే కోసం రెండేండ్ల క్రితం రోడ్డు విస్తరణకు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. నేషనల్ హైవే రోడ్డు పనులు ఆలస్యం కావడంతో కూల్చిన ప్రదేశాల్లో వ్యాపారులు మళ్లీ తాత్కాలిక షెడ్డులు, నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను తాండూరు పోలీసుల సహకారంతో మున్సిపల్ సిబ్బంది కూల్చివేస్తున్నారు. వీటిపై కొందరు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు ఇవ్వకుండా కూల్చివేస్తుండడంతో ప్రభుత్వ సిబ్బందిని తప్పుపడుతున్నారు. ఈ విషయంలో మున్సిపల్, పోలీసు అధికారులు మాట్లాడుతూ.. నిబంధల ప్రకారం అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామన్నారు. గతంలోనే అందరికి నోటీసులు ఇచ్చి రోడ్డు విస్తరణ పనుల కోసం కూల్చామన్నారు. మళ్లీ నిర్మాణాలను చేపట్టడంతో కూలుస్తున్నామని తెలిపారు.

జొన్నల కొనుగోలు గడువును పొడిగించాలి

పూడూరు, మే 31 : జొన్నల కొనుగోలుకు గడువును పొడిగించాలని పీఏసీఎస్ చైర్మన్ కోరారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో రైతులు జొన్నలను కొనుగోలు కేంద్రాలకు తరలించలేకపోయారని తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యేతో పాటు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. రైతులు కూడా సహకరించాలని కోరారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

మర్పల్లి, మే 31 : బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి యాదవ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 17 నెలలు కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా సక్రమంగా నెరవేర్చలేదన్నారు. వానకాలం పంటలు వేసేందుకు రైతులు దుక్కులు చదును చేసుకున్నారని పంటల పెట్టుబడికి రైతు భరోసా డబ్బులు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

డీసీఎం డ్రైవర్‌కు రిమాండ్

నవాబుపేట, మే 31 : మద్యంలో మత్తులో డ్రైవింగ్ చేసి రైతు మృతికి కారణమైన డీసీఎం డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించారు. నవాబుపేట ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని వట్టిమీనపల్లికి చెందిన రైతు గొల్ల కిష్టయ్య శనివారం పొలం దగ్గర నిల్చుని ఉండగా శంకర్‌పల్లి వైపు నుంచి వస్తున్న డీసీఎం డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ రైతు కిష్టయ్యను ఢీకొట్టడంతో రైతు అక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు సందీప్‌ను రిమాండ్‌కు తరలించారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

వికారాబాద్ : పదవీ విరమణ పొందిన కృష్ణారావును సన్మానిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు, తదితరులు

బషీరాబాద్ : ఎంపీడీవో రవికుమార్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు సిబ్బంది

వికారాబాద్, మే 31: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల వ్యవసాయ శాఖల అధికారులు మోహన్‌రెడ్డి, గోపాల్ అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో పని చేస్తున్న సూపరింటెండెంట్ కృష్ణారావు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావును సన్మానించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్వరూప, వెంకట్‌రెడ్డి, తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపవైద్యాధికారికి సన్మానం

వికారాబాద్ : ఉపవైద్యాధికారి జీవరాజు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. జిల్లా వైద్యశాఖలో ఆయన సమర్థవంతమైన అధికారిగా బాధ్యతలు నిర్వహించి అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి వెంకటరమణ, ఉపవైద్యాధికారులు తుకారం, సాయి బాబా, డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ రతన్ లాల్, రిటైర్డ్ వైద్యాధికారి డాక్టర్ షిండే, డాక్టర్లు పవిత్ర, బీబీ జానీ, నిరోషా, ప్రవీణ్ కుమార్, టీజీవో ఉపాధ్యక్షుడు చంద్రప్రకాశ్, జిల్లా పరిధిలోని వైద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు..

బషీరాబాద్ : ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీవో శెట్టి రవికుమార్‌ను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీవోఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్, తాండూరు, బషీరాబాద్ మార్కెట్ కమిటీల చైర్మన్లు బాల్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి, బషీరాబాద్, యాలాల్ ప్యాక్స్ చైర్మన్లు వెంకట్‌రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, నాయకులు అజయ్‌ప్రసాద్, నర్సిరెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రవణ్, బషీరాబాద్, యాలాల్, పెద్దేముల్, బషీరాబాద్ ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు అభినందనీయం

కులకచర్ల : గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సేవలు అభినందనీయమని సీడీపీవో మెహరున్నీసాబేగం అన్నారు. శనివారం కులకచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు వీరమణి (చాపలగూడెం), నర్సమ్మ (రాంరెడ్డిపల్లి), లలితాబాయి, అంబాబాయిలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సేవలను ఆయా గ్రామాల ప్రజలు ఎప్పుడు గుర్తించుకుంటారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లులు అంజిలమ్మ, యాదమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వికారాబాద్ : డాక్టర్ జీవరాజు దంపతులను సన్మానిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు

కులకచర్ల : ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీలను సన్మానించిన సీడీపీవో

చౌడాపూర్ తహసీల్దార్‌గా వాహిదాఖాతూమ్

కులకచర్ల, మే 31 : చౌడాపూర్ తహసీల్దార్‌గా వాహిదాఖాతూమ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. చౌడాపూర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ప్రభులు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సిబ్బందితో పాటు పలువురు నాయకులు ఆమెను సన్మానించారు.

కులకచర్ల తహసీల్దార్‌గా మనోహర్ చక్రవర్తి

కులకచర్ల తహసీల్దార్‌గా మనోహర్‌చక్రవర్తి నియామకమయ్యారు. కులకచర్ల తహసీల్దార్‌గా పని చేస్తున్న మురళీధర్ సెలవుపై వెళ్లడంతో మోమిన్‌పేట్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మనోహర్ చక్రవర్తి కులకచర్ల తహసీల్దార్‌గా జిల్లా అధికారులు నియమించారు.

బషీరాబాద్ తహసీల్దార్‌గా షాహిదా బేగం

బషీరాబాద్ : బషీరాబాద్ తహసీల్దార్ షాహిదా బేగం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ వెంకటేశ్ వారం క్రితం సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో తహసీల్దార్‌గా షాహిదా బేగంను ప్రభుత్వం నియమించింది.

మర్పల్లి తహసీల్దార్‌గా పురుషోత్తం

మర్పల్లి : మర్పల్లి తహసీల్దార్‌గా పురుషోత్తం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన మునిరోద్దీన్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. పురుషోత్తం దోమ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

నవాబుపేట తహసీల్దార్‌గా బుచ్చయ్య

నవాబుపేట : నవాబుపేట తహసీల్దార్‌గా జేవాళ్ల బుచ్చయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన జయరాం సంగారెడ్డికి బదిలీ అయ్యారు. అనంతరం నూతన తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LEASE REQUIRED

★సంవత్సరం లీజుకు 10 Acres to 15 Acres భూమి కావాలి. కొత్తూరు, షాద్‌నగర్, తిమ్మాపూర్ పరిసర ప్రాంతాలవారు 15 సంవత్సరాలు సంప్రదించండి: 9182757179
NT-342957

FINANCE

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

WANTED

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వేర్వేరు చోట్ల ఆబ్కారీ దాడులు

రూ.4.36లక్షల విలువ చేసే డ్రగ్స్ పట్టివేత

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ): నగరంలోని పలుచోట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.4.36లక్షల విలువ చేసే 122 ఎల్ఎస్‌డీ బ్లాస్ట్‌లు, 16 గ్రాముల ఓజీ కుష్, 4.69గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను పట్టుకుని, నిందితులను అరెస్టు చేశారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి కథనం ప్రకారం..ఢిల్లీలోని ఐఐఐటీలో ఉన్నత చదువులు చదువుతున్న కనిష్క్ కెవిన్ అనే యువకుడు డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో మత్తులో కూరుకుపోయిన సదరు విద్యార్థి పరీక్షల్లో ఫెయిల్ కావడంతో హైదరాబాద్‌కు వచ్చి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరాడు. అయితే ఢిల్లీలో ఉన్న పరిచయాలతో అక్కడి నుంచి ఎల్ఎస్‌డీ బ్లాస్ట్‌లు కొనుగోలుచేసి నగరంలో విక్రయించడంతో పాటు తాను తీసుకునేవాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు డీడీనగర్‌లో డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న కనిష్క్ కెవిన్‌ను అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 113ఎల్ఎస్‌డీ బ్లాస్ట్‌లు, 16గ్రాముల ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఎం.దీపక్‌కుమార్, మహ్మమద్ సిరాజ్ , జెతిన్‌లపై కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును కాచిగూడ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

– కుత్బుల్లాపూర్ రేణుక ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయం సమీపంలో నేరుగొండ సాయి అనే వ్యక్తి స్థానికంగా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌టీఎఫ్ పోలీసులు దాడులు జరిపి నిందితుడిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 9 ఎల్ఎస్‌డీ బ్లాస్ట్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

– బెంగుళూరు ప్రాంతానికి చెందిన దేశిక్ ఉపాధి కోసం నగరానికి వలస వచ్చాడు. డ్రగ్స్‌కు అలవాటు పడిన దేశిక్ .. శనివారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్-3లో డ్రగ్స్ విక్రయిస్తుండగా ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకుని, అతడి వద్ద నుంచి 4.69గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బాలరాజు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

మైనార్టీల ఆస్తులను కాజేసేందుకే..

కేంద్రం వక్ఫ్ సవరణ చట్టం తీసుకొచ్చింది

మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ

సిటీబ్యూరో, మే 31(నమస్తే తెలంగాణ): ఆర్థికంగా వెనకబడిన ముస్లింల భూములను కాజేసేందుకే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందని మైనార్టీ జేఏసీ నేతలు విమర్శించారు. తెలంగాణలోని పలు ముస్లిం సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటైన మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ముస్తాక్ మాలిక్ మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగానే ముస్లిం ఆస్తులను కబ్జా చేసేందుకే వక్ఫ్ సవరణ చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎంబీటీ అధ్యక్షుడు మజీద్ ఉల్లా ఫర్హాత్ మాట్లాడుతూ... ''వక్ఫ్ సవరణ చట్టంతో దేశంలోని ముస్లింలే లక్ష్యంగా కేంద్రం దాడి చేస్తోంది. ఒంటెద్దు పోకడలతో నియంతృత్వంగా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీ, బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తాం.'' అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు అబ్దుల్లా సోహైల్ మాట్లాడుతూ... వక్ఫ్ సవర